# కేసీఆర్ పాలనలో "పవర్"ఫుల్

- రెండు మండలాల్లో ఐదు సబ్ స్టేషన్లు
- అదనంగా మరోరెండు ఏర్పాటు

వడ్డేపల్లి, నవంబర్ 11 : తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు రైతులు కరెంటు కోసం పడిగాపులు కాసేవాళ్లు. పంటలకు నీళ్లు పెట్టాలంటే రాత్రిళ్లు పొలాల వద్ద పడుకొని కరెంటు కోసం ఎదురు చూసేవాళ్లు. అలాంటిది రాష్ట్ర ఏర్పాటు తరువాత కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు అందుతుం డడంతో రైతులు మంచిగా పంటలు పండించుకొంటూ సుభిక్షంగా వున్నారు. రెండు మండలాల్లో వడ్డేపల్లి, రాజోలి, రామాపురం, మాన్‌దొడ్డి, పెద్దతాండ్రపాడులలో సబ్‌స్టేషన్లు వు న్నాయి. 2023ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అదనంగా సుమారు రెండు కోట్లతో పచ్చర్ల, జూలేకల్ గ్రామాల్లో రెండు సబ్‌స్టేషన్లు కొత్తగా ఏర్పాటవుతున్నాయి, ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. పచ్చర్లలో సబ్‌స్టేషన్ పనులు పూర్తయితే తనగల, మాన్‌దొడ్డి, పచ్చర్ల రైతులకు లోఓల్టేజి సమస్య వుండదు. జూలేకల్ సబ్‌స్టేషన్ పూర్తయితే జక్కిరెడ్డిపల్లె, జూలేకల్, తిమ్మాజిపల్లె, వెంకట్రామనగర్ గ్రామాలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుంది. వడ్డేపల్లి, రాజోలి మండలాల్లో గత రెండేండ్లలో సింగల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రతి గ్రామానికి ఒకటి, సుమారు 500 పోల్స్, 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 78, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 10 మంజూరు చేశారని ఏఈ సుబ్బారాయుడు తెలిపారు. 123 సెలూన్ షాపులకు ఉచితంగా కరెంటు, ఎస్సీ సబ్‌ప్లాన్ తరపున దళితులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేస్తోంది.



పనులను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు (ఫైల్)

### కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



పొలాలకు నీళ్లు పారించుకోవడానికి కరెంటు ఎప్పుడు వస్తుందో నని ఎదురు చూస్తూ మోటర్లవద్ద రాత్రిళ్ళు జాగరణ చేసేవాళ్లం. సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక రైతుల కష్టాలు తీరాయి. మెరుగైన ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా ఇలా అనేక రకాలుగా రైతులను ఆదుకున్న ఆపద్భాందవుడు కేసీఆర్‌కు రుణపడి ఉన్నాం.

- వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లెడదిన్నె రైతు

### రైతుల సమస్యలకు తక్షణమే పరిష్కారం



మెరుగైన విద్యుత్ సరఫరా కోసం కృషిచేస్తున్నాం. ప్రతి గ్రామంలో విద్యుత్ వెలుగులు నింపాం, రైతులకు లో ఓల్టేజీ సమస్య లేదు, రెండు మండలాల్లో 2033 ట్రాన్స్‌ఫార్మర్లు వున్నాయి. అవరమైన ప్రతి గ్రామానికి పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశాం. గ్రామాల్లో సిబ్బంది అందుబాటులో వుండి విద్యుత్ అంతరాయం కలగకుండా చూస్తున్నారు.

- సుబ్బారాయుడు, ఏఈ

### జీవాలకు పారుడురోగ నివారణ టీకాలు



తూంకుంటలో జీవాలకు టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది

అయిజ రూరల్, నవంబర్ 11 : మండలంలోని తూంకుంట, బింగిదొడ్డి గ్రామాల్లో పశువైద్యాధికారిణి స్వరూపరాణి ఆధ్వర్యంలో శనివారం పశువైద్య సిబ్బంది జీవాలకు పారుడురోగ నివారణ టీకాలను వేశారు. ఇందులో మొత్తం నలుగురికి చెందిన 1,927 జీవాలకు టీకాలు వేశామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా గ్రామాల గొర్రెల కాపరులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుధాకర్, మధు, గట్టుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### మద్యం పట్టివేత

ఉండవెల్లి, నవంబర్ 11: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగురిపై కేసు నమోదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకున్నది. ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు ఇలా..అలంపూర్ మండలం లింగనవాయి గ్రామానికి చెందిన గణేశ్, ఆంజనేయులు 68 మద్యం సీసాలను ద్విచక్ర వాహనంపై మండల కేంద్రం నుంచి స్వగ్రామానికి తీసుకెళ్తుండగా తనిఖీల్లో పట్టుకున్నారు. అలాగే కర్నూల్ జిల్లా కండేరి వీధికి చెందిన గుణశేఖర్ ఆటోలో 18మద్యం సీసాలను అలంపూర్ చౌరస్తా నుంచి కర్నూల్‌కు వెళ్తుండగా వాహన తనిఖీలలో పట్టుకున్నారు. ముగురిపై కేసు నమోదు చేసి ద్విచక్ర వాహనం,ఆటోను సీజ్ చేశామని ఎస్సై తెలిపారు.

**వడ్డేపల్లిలో...**

వడ్డేపల్లి, నవంబర్ 11 : మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో శనివారం ఎస్సై నరేశ్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. శనివారం అటువైపుగా మూటతో వస్తున్న వ్యక్తిపై అనుమానం వచ్చి తనిఖీ చేయగా మద్యంబాటిళ్లతో పట్టుపడ్డాయి. బొంకూరుకు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించామని, 43 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు. తనిఖీలో హెచ్‌సీ రాజవర్ధన్‌రెడ్డి, పోలీసులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణానికి విరాళాల సేకరణ

వడ్డేపల్లి, నవంబర్ 11 :మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో ఎస్ఎస్‌కే. సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో కోయిలదిన్నెకు వెళ్లే దారిలో శివాలయం, అంబాభవాని ఆలయం, సీతారాముల ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్మాణానికి శాంతినగర్‌లో విరాళాలు సేకరిస్తున్నారు. కాగా దాతలు సహకరించాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

### దీపావళి పండుగకు వేళాయే ..



బంతిపూలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

అయిజ, నవంబర్ 11 : ఆదివారం దీపావళి పండుగను జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. చెడుపై మంచి విజయం సాధించిన పండుగ దీపావళి. ఈ సందర్భంగా పట్టణంలోని మార్కెట్‌లో కొనుగోళ్ల సందడి నెలకొన్నది. పటాకులు, బంతిపూలు, మట్టి ప్రమిదలకు మంచి గిరాకీ ఉంది. ప్రమిదలు పలు ఆకారాల్లో ఆకట్టుకుంటుండటంతో ప్రజలు కొనుగోలు చేస్తున్నారు. దీపావళి సందర్భంగా దుకాణాలు, ఇండ్లను అలంకరించుకునేందుకు అవసరమయ్యే బంతి, చేమంతి పూలతో పాటు వివిధ రకాల పూలకు గిరాకీ ఉంది. కొనుగోళ్లతో పట్టణంలో జనంతో సందడి నెలకొంది.



విక్రయానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రమిదలు

### ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల, నవంబర్ 11 : ఓటుహక్కును వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ప్రజలందరూ ఓటుహక్కుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శనివారం సాధారణ ఎన్నికల్లో భాగంగా ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలో రాజీవ్‌మార్గ్‌లో ఏర్పాటు చేసిన బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ మోడల్‌లను ఆమె ప్రారంభించారు. ఐడీవోసీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఐఓటుఫర్ సూర్ అనే సెల్ఫీ పాయింట్‌ను అదనపు కలెక్టర్ అపూర్వచౌ హాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతిఒక్కరు కచ్చితంగా వినియోగించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఓటుయొక్క ఆవశ్యకతను వివరిస్తూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని ఓటు వేయడం ద్వారా మంచి ప్రతినిధిని ఎన్నుకోవచ్చన్నారు. ఓటు ప్రాధా న్యతను ప్రతిఒక్కరు తెలుసుకోవాలని ఎన్నికల్లో ఎలాంటి ధన ప్రలోభాల కు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వినియోగిం చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు రమేశ్‌బాబు, నరేందర్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయ అభివృద్ధికి అన్నివిధాలా కృషి

- గ్రంథాలయాల సంస్థ జిల్లా చైర్మన్ జంబు రామన్‌గౌడ్

గట్టు, నవంబర్ 12 : మండల గ్రంథాలయానికి అన్నివిధాలా అభివృద్ధికి కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జంబు రామన్‌గౌడ్ స్పష్టం చేశారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గ్రంథాలయం నిర్మాణానికి ఇదివరకే భూమిపూజ చేసినట్లు వెల్లడించారు. త్వరలో భవన నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండల గ్రంథాలయం ఎదుర్కొంటున్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణనాయుడు, కంసలి హరి, నర్సింహగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గట్టు గ్రంథాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న రామన్‌గౌడ్

## డీ-30కి చేరిన సాగునీరు



డిస్ట్రిబ్యూటరీ-30లో నిండుగా ప్రవహిస్తున్న నీరు

- హామీని నిలబెట్టుకున్న ఎమ్మెల్సీ చల్లా
- రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం

మానవపాడు, నవంబర్ 11 : విత్తనాలు నాటిన నుంచి వర్షాలు లేక సాగునీటికి పరితపించిన రైతులకు ఆర్డీయస్ కాల్వద్వారా సాగునీటిని విడుదల చేయించి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి. పంటలు ఎండిపోతున్నాయని సాగునీటిని విడుదల చేయించాలని మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఇటీవల ఎమ్మెల్సీని కోరారు. దీంతో ఆయన స్పందించిన ఆయన తుమ్మిళ్ల ఎత్తిపోతల వద్ద షిల్టు పేరుకుపోయిన వాటిని తొలగిస్తే నీరు వచ్చే అవకాశం ఉందని రైతులు కోరారు. దీంతో ఆయన సొంతఖర్చులతో షిల్టు తొలగించారు. సాగునీటి విడుదలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించడం లేదని అక్కడి ముఖ్యమంత్రితో మాట్లాడి నీటి విడుదలకు సహకరించాలని సీఎం కేసీఆర్‌ను కోరిన తక్షణమే వెంటనే స్పందించి నీటివిడుదల చేయించారు. శుక్రవారం తుమ్మిళ్ళ లిఫ్టు మోటర్లు ప్రారంభించడంతో శనివారం డిస్టిబ్యూటరీ 30 వరకు సాగునీరు చేరుకున్నది. ఆర్డీఎస్‌కు సాగునీరు విడుదల కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంటలు పూర్తిస్థాయిలో వచ్చేవరకు సాగునీటిని అందిస్తామని ఎమ్మెల్సీ హామి ఇవ్వడంతో రైతుల ఆనందానికి అవదులు లేకుండ పోతున్నాయి.

### ఆర్డీఎస్ ఆనకట్టకు వరద

- ఇన్‌ఫ్లో 18,843 క్యూసెక్కులు
- అవుట్‌ఫ్లో 18,843 క్యూసెక్కులు

అయిజ, నవంబర్ 11 : కర్ణాటకలోని ఆర్డీఎస్ (రాజోళి బండ డైవర్సన్ స్కీం) ఆనకట్టకు వరద కొనసాగుతోంది. ఏపీ, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఆర్డీఎస్ ఆనకట్టకు వరద చేరుతున్నది. శనివారం ఆర్డీఎస్ ఆనకట్టకు 18,843 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా, ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి 18,300 క్యూసెక్కులు చేరుతు న్నాయి. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 543 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 9.6 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు ఆర్డీఎస్ ఈఈ విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం వస్తున్న వరద నీటితో ఆర్డీఎస్ ఆయకట్టుకు సాగునీరు పుష్కలంగా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

**టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో..**

కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో చేరుతున్నది. శనివారం ఇన్‌ఫ్లో 6,640 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 8,512 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 25.402 టీఎంసీల నీటి నిల్వ ఉంది. 1633 అడుగుల గరిష్ఠ నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 1602.83 అడుగుల నీటి మట్టం ఉన్నట్లు డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు.